క్లుప్తంగా

రాజకీయ ప్రయోజనాల కోసం సంస్థల తాకట్టు

నంద్యాల(అర్బన్): రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను తాకట్టు పెడుతుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, విమర్శించారు. దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచి పెడుతున్న సంఘటలకు నిరసనగా ఎల్ఐసీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయాల ఎదుట సోమవారం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అదానీ.. మోదీకి బినామీ అనేది తేట తెల్లమైందన్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు తాకట్టు పెట్టడాన్ని జనం గమనిస్తున్నారని, తగిన సమయంలో బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారన్నారు. నాయకులు రామకృష్ణ, ఊకొట్టు వాసు, ట్రెజరీ ప్రసాద్, ఫారూక్, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



డీఆర్ఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): అంగన్‌వాడీలకు మూడునెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు కోరారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచి ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని కోరుతూ జిల్లాలోని అంగన్‌వాడీ వర్కర్లు, కార్యకర్తలతో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డీఆర్ఓ పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, లబ్ధిదారులకు ఇచ్చే పౌష్టికాహారం పరిమాణాన్ని పెంచాలన్నారు. నాయకులు లక్ష్మణ్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్‌జిల్లా కార్యదర్శి నిర్మలమ్మ, జిల్లా అధ్యక్షులు సేబారాణి పాల్గొన్నారు.

ఇళ్లను స్వాధీనం చేయాలి

నంద్యాల(అర్బన్): టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు తక్షణమే స్వాధీనం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు కోరారు. జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు రూ.5లక్షలు, టిడ్కో గృహాలు లబ్ధిదారులకు ఇవ్వాలనే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నవరత్నాల్లో భాగంగా అందరికీ ఇళ్లు అన్న నినాదంతో రాష్ట్రంలో 924 జగనన్న కాలనీల్లో 27లక్షల ఇళ్ల నిర్మాణాలు లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ నిర్మాణాలు పూర్తి చేయడం లేదన్నారు. సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇప్పించండి

రుద్రవరం: కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇప్పించాలని స్వచ్ఛభారత్ కార్మికుల సంఘం నాయకులు లక్ష్మయ్య, ఓబులపతి, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, పుల్లమ్మ, నాగేంద్ర అధికారులను కోరారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం డిప్యూటీ తహసీల్దారు మహబూబ్ బాషాకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న తమకు అందాల్సిన వేతనాలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు బైకుల వేలం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సరైన రికార్డులు లేకుండా పట్టుబడిన 25 బైకులకు మంగళవారం వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ కృష్ణయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టుబడిన వాహనాలకు సంబంధించిన రికార్డులు ఉంటే బైకు యజమానులు తీసుకెళ్లాల్సిందిగా కోరారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామానికి చెందిన షరీఫ్ (36) చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. కొద్ది రోజులుగా టీబీతో బాధపడుతున్న షరీఫ్ వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం రాత్రి పురుగుల మందు తాగాడు. బంధువులు వెంటనే కోవెలకుంట్ల వైద్యశాలకు తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య బీబీతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తిరుపాల్ తెలిపారు.

ఆన్‌లైన్‌లో విద్యార్థుల సమాచారం

ఆళ్లగడ్డ: చాగలమర్రి మండలంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ చదివే విద్యార్థుల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఎంఈఓ అనురాధ సోమవారం తెలిపారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థుల సమాచారం అడిగి తెలుసుకున్నారు.

నేడు వాహనాల వేలం

మహానంది: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉన్న నాలుగు మోటారు సైకిళ్లు, ఒక బొలేరో, రెండు టిప్పర్ వాహనాలకు మంగళవారం వేలాలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ నాగార్జున రెడ్డి తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు సంబంధించిన యజమానులు ఉంటే సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించి వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు. లేకపోతే వేలం వేస్తామని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనతోనే సరిపెట్టకుండా మరో అడుగు ముందుకేసి కార్పొరేట్ పాఠశాలలకు కూడా సాధ్యం కాని విధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసింది. నిజమైన సాంకేతిక విద్యకు అర్థాన్ని మార్చి చూపింది. ప్రస్తుతం విద్యార్థులు ట్యాబ్‌ల ద్వారా విద్యనభ్యసిస్తూ నూతన విద్యావిధానాన్ని తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం ఎస్‌ఏ–1 పరీక్షలను కూడా ట్యాబ్‌లో ఉన్న అంశాలపై నిర్వహించారు. ట్యాబ్‌ల్లో బొమ్మలు, ఆడియో,వీడియో, త్రీడీ యానిమేషన్ చిత్రాలతో పాఠ్యాంశాలను రూపొందించడంతో అభ్యాసకులకు సులువుగా అర్థమవుతోంది.



మండలాల వారీగా పంపిణీ చేసిన ట్యాబ్‌ల వివరాలు		
మండలం	విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లు	ఉపాధ్యాయులకు అందజేసినవి
దొర్నిపాడు	246	28
ఆళ్లగడ్డ	1082	80
చాగలమర్రి	620	65
రుద్రవరం	517	58
శిరివెళ్ల	615	63
ఉయ్యాలవాడ	300	39
మొత్తం	3380	333

“ ప్రైవేట్ స్కూళ్లకు తీసిపోని రీతిలో..ఏపీలో ప్రభుత్వ స్కూళ్లను ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నారు. రాష్ట్రంలో విద్యార్థుల ఎదుగుదలకు మంచి అవకాశాలున్నాయి. విద్యా రంగంలో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. 78 దేశాల పర్యటనలో గమనించా.. ఎక్కడా ఇలా జరగలేదు.

– ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ (ఈనెల 1న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన సందర్భంగా చేసిన వ్యాఖ్యలివి.)



ట్యాబ్‌లతో వెళ్తున్న విద్యార్థులు

ఇది కదా.. నిజమైన మార్పు

- సర్కారు బడుల్లో వసతుల కల్పనతో ఆగిపోని ప్రభుత్వం
- 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత
- ట్యాబ్‌లతో తరగతి గదుల్లో బోధన
- సాంకేతిక విద్యకు అసలైన నిర్వచనం
- 2023–2024లో సీబీఎస్ఈ సిలబస్
- నియోజకవర్గంలో 3,713 ట్యాబ్‌ల పంపిణీ

దొర్నిపాడు: పాడుబడిన భవనాల్లా తరగతి గదులు.. చెట్లకింద చదువులు..నేలపై రాతలు..చిరిగిన బట్టలతో..చెప్పుల్లేని కాళ్లతో..అరకొర చదువులు..బోధన..అసలే వసతులు లేని..ఒకప్పుడు ప్రభుత్వ బడి అంటే లభించే నిర్వచనం. కానీ.. పరిస్థితులు మారాయి. నేడు.. అందమైన భవంతులు..ఆహ్లాదం పంచేలా పాఠశాల ఆవరణ, ముచ్చట గొలిపేలా పాఠ్యాంశాల చిత్రాలు, బ్యాగ్, యూనిఫాం, బూట్లు, తాగునీరు, బాత్ రూంలు, బెంచీలపై చదువులు ఇలా బడులను అత్యాధునికంగా తీర్చి దిద్దింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. అంతటితో ఆగిపోకుండా సాంకేతిక విద్యను అందజేయడంలో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసి దేశానికే ఆదర్శంగా నిలిచింది. విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. కొంతమేర మాత్రమే పనులు చేసి చేతులు దులుపుకోకుండా.. కార్పొరేట్ స్థాయికి కూడా సాధ్యం కాని రీతిలో 8వ తరగతి విద్యార్థులందరికీ ట్యాబ్‌లు అందజేసి సాంకేతిక విద్యను మరింత చేరువ చేసింది. ప్రపంచ స్థాయి విద్యావిధానం, నూతన బోధన పద్ధతులు, ఒక అంశానికి వివిధ రకాల ఉదాహరణలు, ప్రఖ్యాత వ్యక్తుల సూక్తులు తదితర అంశాలతో కంటెంట్‌ను రూపొందించి అందజేసింది.

ట్యాబ్‌ల పంపిణీ ఇలా..

నియోజకవర్గంలో 3,713 ట్యాబ్‌లను విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం అందజేసింది. 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఎస్‌ఏ–1 పరీక్షలను కూడా వారికి అందించిన ట్యాబ్‌లలో ఉన్న పాఠ్యాంశాలపైనే నిర్వహించారు. ఇదే విద్యార్థులు 2023–2024లో సీబీఎస్ఈ సిలబస్‌తో వార్షిక పరీక్షలు రాసేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

ట్యాబ్‌లో ఉన్న కంటెంట్..

- గణితం, ఫిజిక్స్, బయాలజీ, హిస్టరీ, జియాలజీ, సివిక్స్, జియోగ్రఫీ, పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలు తదితర పాఠ్యాంశాలు ఉన్నాయి.
- యానిమేషన్, వీడియో ఆడియోలతో ఈ పాఠాలు ఉన్నాయి.
- రూ.1500 విలువ చేసే కంటెంట్‌ను లోడ్ చేశారు.
- తెలుగు, ఇంగ్లిష్ సహా 8 భాషల్లో ఈ కంటెంట్‌ను అందుబాటులో ఉంచారు.
- 8వ తరగతి విద్యార్థులకు సీబీఎస్ఈ విధానంతో పరీక్షలు రాసేలా ట్యాబ్‌లో పాఠాలను రూపొందించారు
- ఇంటి వద్ద సులభంగా చదువుకునేలా వెసులుబాటు కల్పించారు.
- పాఠ్యాంశాలు విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా బొమ్మలు, వీడియో, ఆడియో, త్రీడీ యానిమేషన్ చిత్రాలతో రూపొందించారు. ఇంటర్‌నెట్ సౌకర్యం లేకపోయినా ఆఫ్‌లైన్‌లో ట్యాబ్‌లను వినియోగించుకునేలా తీర్చిదిద్దారు. పాఠ్యాంశాల కంటెంట్‌తో కూడిన మెమొరీ కార్డును ఇన్సర్ట్ చేశారు. ఇతర సైట్‌లోకి వెళ్లకుండా సాఫ్ట్‌వేర్‌ను పొందుపరిచారు.

చాలా ఆనందంగా ఉంది



మాకు ట్యాబ్‌లు అందజేయడం సంతోషం. తరగతిగదిలో మిస్ అయిన పాఠ్యాంశాలను ట్యాబ్‌లో ఇంటివద్ద చదువుకోవచ్చు. ప్రభుత్వం అందించిన యూనిఫాం, బ్యాగ్, బెల్టు, షూస్, ట్యాబ్ చేత పట్టుకొని బడికి వెళ్తుంటే అమ్మానాన్నలు సంబర పడుతున్నారు. ఉపాధ్యాయులు ట్యాబ్‌ల ఆధారంగా పాఠాలను బోధిస్తున్నారు.

–వరలక్ష్మి, విద్యార్థిని, భాగ్యనగరం

కల లాగా ఉంది



ట్యాబ్‌ల ద్వారా సాంకేతిక విద్యను అందజేస్తుండటం కలలాగా ఉంది. ట్యాబ్‌లు భవిష్యత్ చదువులకు ఎంతగానో ఉపయోగ పడుతాయి. ఇప్పటికే అమ్మ ఒడి, విద్యాకానుక, బడిలో నాణ్యమైన గోరుముద్ద, బెంచీల్లో కూర్చొని చదువుకుంటడంపై మాతో పాటు అమ్మానాన్న సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– సుదీప్, విద్యార్థి, క్రిష్టిపాడు

విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందుతుంది



ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు బోధన చేయడం వల్ల పాఠశాల స్థాయి నుంచే సాంకేతిక పరిజ్ఞానం పెంపొందుతుంది. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరిగేలా ట్యాబ్‌ల్లో పాఠ్యాంశాలు ఉన్నాయి. వినడం కన్నా వీడియో చూసి నేర్చుకోవడంతో విద్యార్థులకు బాగా గుర్తుండిపోతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

– అబ్దుల్ కరీం,ఎంఈఓ, దొర్నిపాడు

హుషారుగా గార్దబాల పోటీలు



సాగుతున్న గాడిదల పోటీలు



మొదటి బహుమతి అందుకుంటున్న పెద్దలింగస్వామి

నంద్యాలవ్యవసాయం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోనున్న జంబులాపరమేశ్వరి ఆలయ ఉత్సవాల సందర్భంగా సోమవారం గాడిదల పోటీలు హుషారుగా జరిగాయి. ఉత్సవాల ముగింపు రోజున పందేలు నిర్వహించడం ఆనవాయితీ. పోటీల్లో నంద్యాల, ఆళ్లగడ్డ, రుద్రవరం, చాగలమర్రి, వెలుగోడు, ఆత్మకూరు, మహానంది మండలాల నుంచి 15 గాడిదలు పాల్గొన్నాయి. పోటీలను ఆలయ ప్రధాన కార్యదర్శి గాండ్ల జగన్ మోహన్, పరమేశ్వరరెడ్డి జిల్లెల్ల శ్రీరాములు ప్రారంభించారు. గాడిదలపై 120 కేజీల ఇసుక బస్తాలను వేసి 10 నిమిషాల్లో ఎన్ని అడుగుల దూరం పడిగెడుతుందనే దాన్నిబట్టి విజేతలను ప్రకటిస్తారు. మొదటి బహుమతి వేల్పనూరు పెద్దలింగస్వామికి చెందిన గాడిద 6,622 అడుగులు బరువు మోసింది. ఆ తరువాత వరుస స్థానాల్లో కామినేని పల్లె పెద్దయ్య, బాచేపల్లె నాగేష్, చిన్నవంగలి నవదీప్, కొత్తపల్లెకు చెందిన పెద్ద నరసింహులు, మిట్టపల్లెకు చెందిన వరలక్ష్మి, చిన్నవంగలికి చెందిన నరసింహులుకు చెందిన గాడిదలు నిలిచాయి. గాడిదల యజమానులకు నగదు బహుమతులు అందజేశారు.

ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి



ఆర్డీఓకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): గడివేముల మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ కోరారు. కళాశాలలు లేక పదో తరగతి పూర్తయిన విద్యార్థులు చదువు మధ్యలోనే ఆపాల్సి వస్తుందని, చర్యలు తీసుకోవాలంటూ సోమవారం ఆర్డీఓ శ్రీనివాసులుకు ఆర్‌వీఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాలంటే వ్యయ ప్రయాసాలు పడాల్సి వస్తుందని, ప్రభుత్వం స్పందించి మండల కేంద్రంలోనే కళాశాలల ఏర్పాటు అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలోజిల్లా ప్రధాన కార్యదర్శి రియాజ్, మండల అధ్యక్షుడు రాము, బాలకృష్ణనాయక్ పాల్గొన్నారు.

సుకన్య సమృద్ధి యోజనను సద్వినియోగం చేసుకోండి



చాగలమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ఆడపిల్లల తల్లిదండ్రులు సుకన్య సంమృద్ధి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు సూచించారు. సోమవారం చాగలమర్రిలో తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రలకు అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రతి సంవత్సరం బాలికల పేరిట రూ.15వేలు కట్టుకునే అవకాశం ఉందన్నారు. 18 ఏళ్ల వయస్సు వచ్చాక చదువుకోసం సగం నగదును తీసుకోవచ్చని, 21 ఏళ్ల తర్వాత మొత్తం నగదును పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ పోస్టల్ ఇన్స్పెక్టర్ మాళేశ్వరరెడ్డి, పోస్టుమాస్టర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆకులు రాలుతున్నాయని..!



పాఠశాల ఆవరణలో చెట్లను నరికి దుంగలుగా మార్చిన దృశ్యం

పాములపాడు: ప్రభుత్వాలు, ప్రకృతి ప్రేమికులు చెట్లను పెంచాలని ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడం చూస్తూ ఉంటాం. అయితే బాధ్యత గల ఉపాధ్యాయురాలు చెట్లంటే కోపమో ఏమో తెలియదు కానీ పాఠశాల ఆవరణలోని 10 భారీ వృక్షాలను నరికి వేసిన ఘటన మండలంలోని ఎర్రగూడూరు గ్రామం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం చోటుచేసుకుంది. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా రాణి ఈ ఘాతుకానికి ఒడిగట్టడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. విద్యార్థులకు నీడనిచ్చే వృక్షాలను ఎలా నరికిస్తారని గ్రామస్తులు మండిపడుతున్నారు. దుంగలను విక్రయించడానికే చెట్లను నరికించిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శుభ్రం చేయడానికి ఇబ్బందిగా ఉందని..

ఈ విషయం పై ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా రాణిని వివరణ కోరగా స్కావెంజర్లు శుభ్రం చేయడానికి ఇబ్బందిగా మారిందని, చెట్ల కొమ్మలు, ఆకులు ఎక్కువగా రాలుతున్నాయని చెప్పారు. పిల్లలు వాష్‌రూం వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని, ఆట స్థలం విశాలంగా ఉంటుందని చెట్లను నరికించినట్లు వివరించారు. చెట్లను నరకకూడదని మాకు కూడా తెలుసు అని చెప్పడం గమనార్హం.

కైలాసద్వారం వద్ద అన్నదానం

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా పాదయాత్రగా వచ్చేభక్తుల సౌకర్యార్థం కై లాసద్వారం వద్ద సోమవారం దేవస్థానం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణను ప్రారంభించినట్లు దేవస్థానం ఈఓ ఎస్ లవన్న తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి ఈ అన్నప్రసాదాల అందజేస్తారన్నారు. అదే విధంగా భక్తులకు మంచినీటితో పాటు బిస్కెట్లు కూడా అందజేస్తురని చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్య సమన్వయంతో కై లాసద్వారం వద్ద ఉచిత వైద్యశిబిరం కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

ప్రజల అభీష్టాన్ని తెలుసుకోండి



మాట్లాడుతున్న మండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

శిరివెళ్ల: ప్రజల మనోభీష్టాన్ని తెలుసుకొని వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేయాలని, అలాగే పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలని శాసనమండలి విప్ గంగుల ప్రభాకరరెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లకు వర్క్ షాప్ జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందించిన పథకాలపై ఇంటింటికి తిరిగి వివరించాలని, అలాగే పార్టీ నెరవేర్చిన హామీలను తెలియజేయాలని చెప్పారు. ప్రభుత్వం పట్ల ప్రజలకు సంతృప్తిగా ఉన్నారా, అసంతృప్తిగా ఉన్నారా అన్నది స్పష్టంగా తెల్సుకోవాల్సిన బాధ్యత మీదేనన్నారు. అసంతృప్తిగా ఉంటే ఏ విషయంలో వారు అసంతృప్తిగా ఉన్నారన్నది కూడా తెలుసుకోవాలన్నారు. పార్టీ అందచేసిన 5 ప్రశ్నల బుక్‌లెట్‌తో ఈ నెల 11వ తేదీ నుంచి సచివాలయ కన్వీనర్ల ఆధ్వర్యంలో గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలని చెప్పారు. మన ప్రభుత్వం ప్రజలకు అందించిన లబ్ధిని వివరించాలని తెలిపారు. అర్హులైన వారు పథకాలకు దూరంగా ఉంటే వారికి కూడా పథకాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాల అమలుకు 2.34 లక్షల మంది గ్రామ, వార్డు వలంటీర్లను నియమించిందన్నారు. పాలనను ప్రజలకు చేరువ చేసేందుకు గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను నెలకొల్పి 1.13 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చిందని వివరించారు. అలాగే ఇచ్చిన హామీల్లో 98.4 శాతం అమలు పర్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి, పార్టీ నియోజక వర్గ పరిశీలకుడు నరసింహారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్లాద్‌నాయక్, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, ఎంపీపీ నాయక్ వసీం, మండల ఉపాధ్యక్షురాలు చీమల అనూష, మండల నాయకుడు ప్రతాపరెడ్డి, మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడు నరహరి, సర్పంచులు సాలమ్మ, సుభహాన్, నాగన్న, పెద్ది రమణయ్య. రఘునాథ రెడ్డి, మేర్వ చిన్న నరసింహారెడ్డి, దూదేకుల ఉశేన్‌బీ, ఆర్యవైశ్య సంఘం నాయకుడు వంకదార సుబ్బ సత్యనారాయణశ్రేష్టి పాల్గొన్నారు.



హాజరైన గృహ సారథులు, కన్వీనర్లు

రేపు బాలికల జూనియర్ కళాశాల భవనాల సముదాయం ప్రారంభం

నంద్యాల(అర్బన్): ఈనెల 8వ తేదీన స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోనున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్మించిన నూతన భవన సముదాయాలను ప్రారంభిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖరప్ప సోమవారం తెలిపారు. ఆర్డీటీ సంస్థ సహాయంతో నిర్మించిన నూతన భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి అన్నా ఫెర్రర్, ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్, ట్రస్టు డైరెక్టర్ విషా ఫెర్రర్ ముఖ్య అతిథులుగా హాజరు కానుండగా.. ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే, శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా విశిష్ట అతిథులుగా హాజరై నూతన భవనాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

మున్సిపల్ స్పందనకు నాలుగు వినతులు

నంద్యాల(సిటీ): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహమూర్తి పర్యవేక్షణలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి నాలుగు వినతులు వచ్చాయి. పట్టణంలో ఉన్న 43 వార్డు సచివాలయాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నందున మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే స్పందనకు వినతులు తగ్గాయని ఆయన తెలిపారు. వినతుల్లో రెండు పింఛన్, రెండు టిడ్కో గృహాలకు సంబంధించిన సమస్యలపై ఫిర్యాదులు అందయాన్నారు. రెవెన్యూ ఆఫీసర్ వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ–క్రాప్, ఈ–కేవైసీ చేయించుకోవాలి

దొర్నిపాడు: రబీలో సాగుచేసిన పంటలకు ఈ–క్రాప్ అనంతరం వెంటనే నిర్ధారించేందుకు ఈ–కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ రైతులకు సూచించారు. సోమవారం స్థానిక వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఇంత వరకు చేసిన ఈ–క్రాప్ నమోదు, ఈ–కేవైసీ వివరాలు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే రైతులు ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 15 వరకు గడువు ఉందని వంద శాతం నమోదు చేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. వీఏఏలు మల్లికార్జున, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



వృద్ధుడికి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

శిరివెళ్ల: పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాలతో పాటు వివిధ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక 4వ గ్రామ సచివాలయ పరిధిలోని 16వ వార్డులో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి మూడున్నరేళ్లలో అందిన సంక్షేమ పథకాలు, చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్ అందజేశారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. కొందరు ప్రస్తావించిన సమస్యలకు అప్పటికప్పుడు స్థానికంగా అధికారులను ఆదేశించి పరిష్కరించగా, మరికొన్నింటిని త్వరలో పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ. అబ్దుల్ సలాం, ఎంపీపీ నాయక్ వసీం, హిస్టరీ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ హాఫీజ్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఈఓఆర్డీ సాల్మన్‌రాజు, సర్పంచు సాలమ్మ, ఉపసర్పంచు ఇంతియాజ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నజీర్, దేవస్థానం చైర్మన్ తిమ్మరాయుడు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవ ఆహ్వానపత్రికను కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు అందజేస్తున్న ఈఓ



ఎస్పీ కె. రఘువీర్ రెడ్డికి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఈఓ ఎస్. లవన్న

ఉత్సవాలకు ఆహ్వానం

బొమ్మలసత్రం: శివరాత్రి సందర్భంగా శ్రీశైలం క్షేత్రంలో ఈనెల 11 నుంచి 21వ తేదీ వరకు జరిగే శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిని ఆలయ ఈఓ ఎస్.లవన్న సోమవారం ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వానపత్రిక అందజేసి ఆలయ అధికారులు, వేదపండితులు ఎస్పీని ఆహ్వానించారు. అనంతరం అడిషనల్ ఎస్పీ రమణను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

‘భద్ర’ నిర్మాణంతో సీమకు అన్యాయం

నంద్యాల(అర్బన్): కర్ణాటక రాష్ట్రంలోని ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణం వల్ల రాయలసీమ ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఇలాంటి చర్యలను సహించమని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నంద్యాల డివిజన్ కార్యదర్శి శంకర్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వం ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణం చేపడితే రాయలసీమ జిల్లాలకు, ముఖ్యంగా కర్నూలు జిల్లాకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.5వేల కోట్లు నిధులు కేటాయించి జాతీయ హోదా కల్పిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించడం విడ్డూరమన్నారు. కర్ణాటకలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం రాజకీయ లబ్ధి పొందడానికే కుట్ర చేస్తుందని మండిపడ్డారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరారు. కేంద్రం తీరును మార్చుకోవాలని సూచించారు. కార్యక్రజుమంలో నాయకులు రఫీ, చౌడప్ప, మహమ్మద్, మౌలీసా, ఖాజామీయా తదితరులు పాల్గొన్నారు.